


# రైతుల సంక్షేమానికి ప్రోత్సాహకాలిస్తున్న సిఎం : ఎమ్మెల్యే



పుత్తూరు (నగరి), ఆగస్టు 14 ప్రభాతవార్త : రైతు బాగుంటే సమాజం కూడా బాగుంటుందనే ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వ్యవసాయం లాభసాటిగా సాగేందుకు రైతులకు అనేక ప్రోత్సాహకాలు అందిస్తున్నారని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్ తెలిపారు. పిఎం కిసాన్ పథకం కింద కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన రూ. 2000 వేలకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 5000 వేలు కలిపి అన్నదాత - సుఖీభవ పథకం కింద తొలి విడతగా ప్రతి రైతుకు మొత్తం రూ. 7000 వేలు జమ చేసిన సందర్భాన్ని పురస్కరించుకుని గురువారం నగరి పట్టణంలో వందలాది మంది రైతులు ట్రాక్టర్లతో ర్యాలీ నిర్వహించి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వ నిర్వాకం వల్ల రాష్ట్రంలో తీవ్ర ఆర్థిక లోటు వున్నప్పటికీ ముఖ్యమంత్రి రైతుల సంక్షేమాన్ని దృష్టిలో వుంచుకుని నిధులు విడుదల చేశారని తెలిపారు. వ్యవసాయాన్ని ప్రోత్సహించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని అందులో భాగంగా విత్తనాలు, ఎరువుల కొరత లేకుండా ఇప్పటికే జాగ్రత్తలు చేపట్టినట్టు తెలిపారు. వ్యవసాయ పనిముట్లను సబ్సిడీపై అందిస్తున్నామని గతంలో ట్రాక్టర్లను సైతం సబ్సిడీపై ఇచ్చిన ఘనత తెలుగుదేశం పార్టీ ప్రభుత్వానికి దక్కుతుందని తెలిపారు. వ్యవసాయాధికారులను నేరుగా పొలాలకు పంపించి ఏ పంట సాగు చేస్తే రైతులకు లాభం చేకూరుతుందో ఆ మేరకు సలహాలు, సూచనలు ఇస్తున్నామ న్నారు. గత అయిదేళ్ల వైసిపి పాలనలో ఆంధ్రప్రదేశ్ అరాచ కాలకు, లూటీలకు కేంద్రంగా నిలిచిందని విమర్శించారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శాంతి, భద్రతలను అదుపులో పెట్టారని ప్రజలు స్వేచ్ఛగా తమ కార్యకలాపాలు చేసుకోగలుగుతున్నారని తెలిపారు. నగరి నియోజకవర్గంలో ప్రజలెవరైనా వారి సమస్యలు తన దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. సమావేశంలో చిత్తూరు పార్లమెంట్ సభ్యుడు దగ్గుమళ్ల ప్రసాదరావు, స్థానిక టిడిపి నాయకులు పాల్గొన్నారు.

# ఉమ్మడి చిత్తూరు జిల్లా విభజన సమస్యలు...

## కొలిక్కివస్తాయా!

-తప్పుల తలనొప్పులు సరిదిద్దుతారా!

ప్రభాతవార్త-తిరుపతి:




నాలుగేళ్ళ క్రిందట ఉమ్మడిచిత్తూరుజిల్లా లో 66మండలాలు విభజించి కొన్ని మండలాల్ని తిరుపతి కొత్త జిల్లాలో కలిపిన అప్పటి ప్రభుత్వం ప్రజల సమస్యలు పట్టించుకునే పాపానలేక పోయింది. పాలన సవ్యంగా సాగి ప్రజల సమస్యలు పరిష్కారమయ్యే రెవెన్యూ,పోలీస్‌శాఖల పరంగా ఎక్కడెక్కడో మారుమూల మండలాలను సంబంధంలేని కొత్తగా ఏర్పడిన రెవెన్యూ డివిజన్లలో కలిపేయడంతో కొన్ని గ్రామాల,మండలాల ప్రజలు తికమకతో చిన్న సమస్యకు తమిళనాడు సరిహద్దుల్లోంచి వెళ్ళాల్సి రావడంతో తలనొప్పి వ్యవహారంగా మారిన విషయం విదితమే. ఈ సమస్యలపై, కొత్త రెవెన్యూ డివిజన్లపై 2022లోనే (అప్పట్లోనే)పలు మండలాల ప్రజలు తీవ్రస్థాయిలో నిరసనలు, నిరాహారదీక్షలు చేపట్టిన సంగతి తెలిసిందే. అయినా అప్పటి ప్రభుత్వం, ప్రభుత్వ అధికారులు, మంత్రులు కూడా పట్టించుకోలేదు. దీంతో ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పలు మండలాల ప్రజలు అయోమయానికి గురయ్యారు. అంతేగాక ఆ ప్రభుత్వంలో ముగ్గురు మంత్రులు ఉన్నా ప్రజల సమస్యలు పట్టించుకుని పరిష్కరించలేకపోయారనే విమర్శలు ఇప్పుడు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం అదికారంలోని కూటమి ప్రభుత్వం విభజన జిల్లాలు ,మండలాలు, గ్రామాలు సరిహద్దులు సక్రమంగా లేవనే ప్రజల నిరసనలను పరిగణనలోనికి తీసుకుని తాజాగా ప్రజలకు సానుకూలంగా ఉండేలా చూస్తున్నారు. ఇందుకోసం మంత్రుల కమిటీ ప్రజాభిప్రాయాలు తీసుకుని అందరికీ ఆమోదయోగ్యంగా పాతరెవెన్యూ డివిజన్లను కొనసాగించడం, కొన్ని పాతమండలాలను మళ్ళీ యధాతథంగా పాలనపరంగా మార్పులు తీసుకునే దిశగా చూడనున్నారు. 2022లో వైసిపి ప్రభుత్వం చేపట్టిన జిల్లాల పునర్విభజన నిర్ణయంతో చిత్తూరు జిల్లా, తిరుపతి జిల్లాలో ప్రజల్లో అయోమయం వీడలేదు. చిత్తూరుజిల్లాను విడదీసి కొన్ని మండలాలను తిరుపతి జిల్లాలో, కొన్ని మండలాలను అన్నమయ్య జిల్లాలో కలిపేయడం తికమకతో అశాస్త్రీయంగా జరిగిందని ప్రజలు నేటికీ గగ్గోలుపెడుతున్నారు. ఎంతో విశిష్టత ఉన్న వందేళ్ళ చరిత్రకలిగిన చిత్తూరుజిల్లాను విడదీయడం వల్ల కలసివున్న పలు మండలాల ప్రజలు అయోమయంతో ఇబ్బందిపడుతున్నారు. పునర్నిర్మాణం వల్ల ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలను కోల్పోయిన చిత్తూరు జిల్లాలో నగరి రెవెన్యూ డివిజన్ ఏర్పాటు అనవసర సమస్యలకు, వివాదాలకు దారితీసింది. నగరి డివిజన్‌లో ఆ నియోజకవర్గంలోని పుత్తూరు, వడమాలపేట మండలాలను తిరుపతి జిల్లాలో కలిపారు. ప్రస్తుతం నగరి నియోజకవర్గాన్ని తిరుపతి జిల్లాలో కలిపేందుకు ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్ తీవ్రస్థాయిలో ప్రయత్నాలు చేస్తున్నారు. జిడినెల్లూరు నియోజకవర్గంలోని పాలసముద్రం, ఎస్ఆర్‌పురం, కార్వేటినగరం, వెదురుకుప్పం మండలాలను నగరి డివిజన్‌లో కలపడంతో ఆ మండలాల ప్రజలు అప్పట్లోనే నిరసనలు తెలిపారు.

ఈ మండలాలు చిత్తూరుకు మరీ 40కిలోమీటర్ల దూరంలోనే ఉండటం, పాతజిల్లా కేంద్రంతో అనుబంధం ఉండటంతో ఎక్కడో తమిళనాడు సరిహద్దులు దాటి మళ్ళీ ఆంధ్రలో కలసిన నగరికి వెళ్ళాలంటే నక్కకు నాగలోకానికి తేడానే అని నిట్టూర్చారు. కార్వేటినగరంలో మాజీ నేతలు కొందరు ఏకంగా నిరాహారదీక్షలు చేపట్టారు. వెదురుకుప్పం మండలంలో అఖిలపక్షం ఆమరణ నిరాహారదీక్ష కూడా చేపట్టింది. మిగిలిన మండలాల ప్రజలు అసహనంతో రగిలిపోయారు. రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని పుంగనూరును, తిరుపతి జిల్లాలో కలపడం వల్ల తమకు చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయని నెల్లూరుకు సమీపంలో ఉన్న వెంకటగిరి, గూడూరు, సూళ్ళూరుపేట నియోజవర్గాల ప్రజలు ఆవేదన వెళ్లగక్కుతున్నారు. ఇదే విషయాలను గత ఎన్నికల సమయంలో ప్రస్తుత సిఎం చంద్రబాబుకు విన్నదించారు. పార్లమెంట్ నియోజకవర్గాల ప్రాతిపదికగా జిల్లాలను ఏర్పాటుచేయడం తప్పుగా మేధావి వర్గం వాదించింది. జిల్లాల ఏర్పాటులో హేతుబద్ధత కరువైందని కొందరు విమర్శిస్తు న్నారు. ఈ నేపథ్యంలో ఇప్పుడు మళ్ళీ జిల్లాల పునర్విభజన వ్యవహారాలను చక్కబెట్టేందుకు ప్రభుత్వం సిద్ధం కావడంతో సిఎం సొంత జిల్లా ప్రజల ఆకాంక్షలకనుగుణంగా రెవెన్యూడివిజన్ వివాదాలకు తెరదించాలనేది జనం కోరుతున్నారు.










# చిత్తూరు ఖ్యాతి పెరిగేలా అభివృద్ధి

- చిత్తూరు అభివృద్ధి కోసం మరిన్ని ప్రైవేటు పెట్టుబడులు - న్యూట్రిన్ ఫ్యాక్టరీ స్థలంలో వ్యాపార, గృహ సముదాయాలకు భూమి పూజ చేసిన కలెక్టర్, ఎమ్మెల్యేలు



న్యూట్రిన్ ఫ్యాక్టరీ స్థలంలో గృహ సముదాయాలు, వాణిజ్య కాంప్లెక్స్‌లకు భూమి పూజ చేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

చిత్తూరు, ఆగస్టు 14 ప్రభాతవార్త: సిఎం నారా చంద్రబాబు నాయుడు స్ఫూర్తితో చిత్తూరు ఖ్యాతి పెరిగేలా సొంత ఊరి కోసం అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు పేర్కొన్నారు. చిత్తూరు నగరంలోని న్యూట్రిన్ ఫ్యాక్టరీ స్థలంలో ఆధునిక హంగులతో నిర్మించనున్న ఎన్.అవెన్యూ వాణిజ్య, గృహసముదాయాల ప్రాజెక్టు పనులకు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎన్ఆర్ఐ కొండా నరేంద్రతో కలిసి గురువారం భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మేయర్ అముద, చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గురజాల మాట్లాడుతూ సిఎం నారా చంద్రబాబునాయుడు స్ఫూర్తితో పుట్టిన ఊరికి మంచి చేయాలని భావించి చిత్తూరు నగరంలో ప్రఖ్యాతి గాంచిన న్యూట్రిన్ ఫ్యాక్టరీ స్థలంలో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఇక్కడ తంబళ్ళపల్లికి చెందిన ఎన్ఆర్ఐ మిత్రుడు కొండా నరేంద్రతో కలిసి ప్రపంచ స్థాయి షాపింగ్ మాల్స్, హోటల్స్, గృహ సముదాయాల నిర్మాణాలను చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఈ ప్రాజెక్టు ద్వారా నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ఇదే స్ఫూర్తితో విదేశాల్లో స్థిరపడ్డ చిత్తూరు పౌరులు చిత్తూరు నగర అభివృద్ధికి విస్తృతంగా పెట్టుబడులు పెట్టాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. రెండు మెట్రోపాలిటన్ నగరాల మధ్య చిత్తూరు వుండటం, ఎక్స్‌ప్రెస్ హైవేలు, రైళ్ళు, విమానాశ్రయాలు అందుబాటులో వుండటంతో చిత్తూరులో లాజిస్టిక్, ఇండస్ట్రియల్ పరంగా పెట్టుబడులు పెట్టడానికి మంచి అవకాశాలు వున్నాయన్నారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ చిత్తూరులో పెట్టుబడులు పెట్టడానికి మంచి అవకాశాలు వున్నాయని, ప్రైవేటు పెట్టుబడుల ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. మౌళిక సదు పాయాలు, ఇతర రంగాల్లో ప్రైవేటు పెట్టుబడులను స్వాగతిస్తున్నామని, వీరి స్ఫూర్తితో మరింత మంది చిత్తూరు నగరంలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకు రావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఎన్ఆర్ఐ కొండా నరేంద్ర మాట్లాడుతూ చిత్తూరు నగరంను అభివృద్ధి చేయాలని నిర్ణయించి ఇక్కడ పెట్టుబడులు పెట్టడానికి సిద్ధం అయ్యామన్నారు. ఈ స్థలంలో షాపింగ్ మాల్స్, మూడు స్టార్ హోటల్స్ నిర్మిస్తున్నామని వీటిని యువతకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. అందరి సహాయ సహకారాలతో చిత్తూరు నగరంను మరింత అభివృద్ధి చేసి ముందుకు తీసుకెళ్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గురజాల చెన్నకేశవులు నాయుడు, గురజాల జీవన్, మాజీ ఎమ్మెల్సీ బిఎన్.రాజసింహులు,తెలుగుదేశం పార్టీ పరిశీలకులు సునీల్‌కుమార్, జిల్లా తెలుగుదేశం నాయకులు కాజూరు బాలాజీ, గాంధీ ఇతర తెలుగుదేశం నాయకులు, అధికారులు, కూటమి పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.













# జిల్లా అభివృద్ధికి అధికారుల కృషి అవసరం

- ఆ దిశగా అడుగులు వేయాలి
- ఎం.టి కృష్ణబాబు,డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణబాబు, డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్

తిరుపతి కలెక్టరేట్, ఆగస్టు 14 ప్రభాతవార్త : తిరుపతి జిల్లా అభివృద్ధి అధికారులు కృషి ఎంతైనా అవసరం అని కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫెరెన్స్ హాల్ నందు జిల్లా సమగ్ర అభివృద్ధికి సంబంధించిన వివిధ శాఖల ద్వారా అమలవుతున్న ప్రభుత్వ పథకాల అమలుపై రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ, జోనల్ ఇంచార్జి అధికారి కృష్ణ బాబు, జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్,జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, మున్సిపల్ కమిషనర్ మౌర్య, అడిషనల్ ఎస్పీ రవి మనోహరాచారి, ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘు వాని, డీఆర్వో నరసింహులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. కృష్ణబాబు మాట్లాడుతూ వినూత్న ఆలోచన దిశగా జిల్లా అధికారులు తిరుపతి జిల్లా అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ పెట్టి పురోగతి సాధించాలన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ కృష్ణబాబు ఇచ్చిన సలహాలు, సూచనలు తప్పకుండా ఆచరించడంతో పాటు అనుకున్న లక్ష్యాలను సకాలంలోనే పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.







### పావలా ఆదాయం వస్తుందని పనులు చేస్తే...

# ముప్పావలా వడ్డీలు చెల్లించుకుంటున్నాం!

కూటమి పాలనలో పనులు చేసిన కాంట్రాక్టర్ల ఆవేదన

*శ్రీకాళహస్తి మున్సిపాలిటిలో నామినేషన్ పనులు చేసిన కాంట్రాక్టర్లు ఆర్నేల్లుగా చెల్లింపుల్లేక తల్లడిల్లుతున్నారు. పావలా ఆదాయం వస్తుందని పరుగులు తీసి పనులు చేస్తే ముప్పావలా వడ్డీలు చెల్లించుకుంటూ అప్పుల పాలయ్యామని వాపోతున్నారు. ఆర్నేల్లుగా బిల్లులు చెల్లింపుల్లేక సుమారు రూ.2కోట్లకు పైగా బకాయిలు పేరుకుపోయినట్లు సమాచారం.గత ప్రభుత్వ పాలనలో తీసుకున్న నిర్ణయంతో బిల్లుల చెల్లింపు మున్సిపాలిటి చేతిలో లేదు.ఇక్కడ వసూలు చేసిన పన్నుల సొమ్ములను సిఎఫ్ఎంఎస్‌కు పంపాలి. చెల్లింపులకు సంబంధించి వారు పరిశీలించి క్లియరెన్స్ చేయాలి.*

శ్రీకాళహస్తి,ఆగస్టు 14 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి మున్సిపాలిటిలో గత 15 నెలలుగా పనుల చేసిన కాంట్రక్టర్లు చెల్లింపుల్లేక అప్పుల పాలయ్యామని వాపోతున్నారు. ఏ ప్రభుత్వం అధికారంలో ఉంటే ఆ ప్రభుత్వం తమ అనుచరులకు ఆయా వార్డుల్లో ఉన్న పార్టీ ప్రముఖులకు నామినేషన్స్‌పై పనులు అప్పగిం చటం వారు ఆ పనులను కాంట్రాక్టర్లకు అప్పగించి తృణమో, పణమో తీసుకోవటం ఆర్థికంగా బలపడటం జరుగుతుంది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత చిన్న ప్యాచ్ పనులు, రోడ్డు పనులు, కాలువ పనులు ఇతర పనులు చేయటానికి అప్పగించారు. ఇలా చేసిన పనులకు సంబంధించి సుమారు రూ.1.5కోటి వరకు బిల్లులు రాక ఇబ్బందులు పడుతున్నట్లు వాపోతున్నారు. 'పావలా ఆదాయం వస్తుందని ఆశ పడి పనులు చేస్తే నెలల తరబడి చెల్లింపుల్లేక ముప్పావలా వడ్డీలు చెల్లించుకుంటూ అప్పుల పాలయ్యామని' వాపోతున్నారు.

**సిఎఫ్ఎంఎస్ క్లియరెన్స్‌తోనే చెల్లింపులు:**

మున్సిపాలిటి పరిధిలో చేసిన పనులకు సంబంధించి ఇతర అంశాలకు సంబంధించి ఇక్కడి అధికారులు బిల్లులు పొందుపరచాలి. దానిని ప్రీఆడిట్ చేయాలి. దానిని కమిషనర్ సంతకంతో సిఎఫ్ఎంఎస్‌కు పంపాలి. వారు పరిశీలించి క్లియరెన్స్ చేయాలి. అయితే ముగ్గురు కమిషనర్లు మారినా చెల్లింపుల్లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముగ్గురు కమిషనర్లు ఆమోదించి పంపినా బిల్లులు క్లియరెన్స్ రాలేదని వాపోతున్నారు. శ్రీకాళహస్తి మున్సిపాలిటిలో మాత్రం చెల్లింపులు కావటం లేదని చెబుతున్నారు. రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటిలలో చెల్లింపులు జరుగుతుంటే శ్రీకాళహస్తి మున్సిపాలి టిలో ఎందుకు చెల్లింపులు జరగటం లేదన్నది ప్రశ్నార్థకంగా మారింది. శ్రీకాళహస్తి మున్సిపాలిటికి ఏడాది జనరల్ ఫండ్ రూ.9కోట్లు ఇందులో కనీసం 95శాతం వసూలు చేస్తున్నారు. మరి ఇంత సొమ్ములు వసూలు చేస్తున్నప్పటికి ఎందుకు చెల్లింపలు జరగటం లేదనేది శేష ప్రశ్నగా మారింది. పనుల బిల్లులే కాకుండా ఎలాంటి చెల్లింపులు కావటం లేదనిచెబుతున్నారు.

**గతంలో కూడీ నారు చెట్టు పనుల చేసిన వారి పరిస్థితి ఇదే ...**

శ్రీకాళహస్తి నియోజకవర్గంలో 2014-19లో తెలుగుదేశం కార్యకర్తలు 'నీరు-చెట్టు' పథకం లో పనులు చేసారు. ఇరిగేషన్ శాఖలో పనులు చేసిన బిల్లులు ఇంకా రూ.2కోట్లు చెల్లింపులు జరగలేదని సమాచారం. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన తరువాత మున్సిపాలిటిలో పనులు చేసిన వారు చెల్లింపుల్లేక తల్లడిల్లుతున్నారు. జనరల్ ఫండ్ ఉన్నా బిల్లుల చెల్లింపులు, ఇతర బిల్లులు చెల్లింపు కాకపోవటానికి కారణమేమిటి? అనేది ఎవ్వరికి అంతుపట్టని శేష ప్రశ్నగా మారింది.




# నంది వాహనంపై దర్శనమిచ్చిన పార్వతీ పరమేశ్వరులు



పాకాల ఆగస్టు 14 ప్రభాతవార్త : పాకాల మండలం ఉప్పరపల్లె పంచాయతీ ఊట్ల వారి పల్లె సమీపాన ఆనందగిరి కొండపై వెలసి ఉన్న శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి వారి ఆలయంలో 77వ బ్రహ్మోత్స వాలలో భాగంగా గురువారం రోజున ఆది దంపతులు లైన శ్రీ పార్వతీ పరమేశ్వరులు నంది వాహనంపై భక్తులకు దర్శన మిచ్చారు. ఆడికృత్తిక సందర్భ ంగా నిర్వహిస్తున్న బ్రహ్మోత్స వాలకు గురువారం భక్తులు పెద్ద ఎత్తున పోటెత్తరు. గురువారం ఉదయం నుంచి ఆలయంలో విపరీతమైన భక్తుల రద్దీ ఏర్పడింది. సాధారణంగానే భక్తు తాకిడి అధికంగా ఉంటుంది. ప్రస్తుతం బ్రహ్మోత్స వాలు కావటంతో మరీ అధికంగా భక్తుల తాకిడి కనబడింది. ఉదయం గర్భగుడిలో శ్రీ వల్లి, దేవసేన, సమేత సుబ్రమణ్యం స్వామిని చక్కగా అలంకార భూషితులైన స్వామి అమ్మవార్లు భక్తులకు దర్శనమిచ్చారు. ఉభయ దారులచే సాయంత్రం నంది వాహనాన్ని మరియు దేవీ దేవేరులను చక్కగా పూలతో అలంకరణ చేసారు. ఈ కార్యక్రమానికి ఎం ఎల్ ఏ పులివర్తి నాని ముఖ్య అతిధి కాగా మేళా తాళాలతో మంగళ వాయిద్యాల నడుమ అశేష జన వాహిని వెంటరాగా గ్రామోత్సవం ఆద్యాంతం కన్నుల పండువగా సాగింది.






## వైభవంగా మహా కుంభాభిషేకం

**పులిచెర్ల, ఆగస్టు 14, ప్రభాతవార్త**



పులిచెర్ల మండలం కల్లూరు శ్రీ దక్షిణ కాశీశ్వర స్వామి మరియు వల్లి దేవసేన సమేత శ్రీ సుబ్ర హ్మణ్య స్వామి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా గురువారం ఆలయంలో ఉదయం కలశ పూజ, ప్రతిష్ట హోమాలు, గోపూజ నిర్వహించారు. ఉదయం 9 గంటలు నుండి 10 గంటలు లోపల శుభలగ్నం నందు. మహా కుంభాభిషేకం. పంచామృతాభిషేకము వేద పండితులు నిర్వహించారు అనంతరం ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించి మహా మంగళారతి గావించి భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. ప్రధాన అర్చకులు రాజశేఖర్ దీక్షితులు, మల్లేష్ భరద్వాజ్, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ జరిపారు. పెద్ద ఎత్తున భక్తులు ఉత్సవాలలో పాల్గొని స్వామివారిని కనులారా తిలకించారు

## ఘనంగా ధ్వజారోహణ కార్యక్రమం

**సదుం, ఆగస్టు 14, ప్రభాతవార్త**



సదుంలోని శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి వారి ఆలయంలో గురువారం సాయంత్రం ఆడికృత్తిక ఉత్సవాలు ప్రారంభమైనవి. ఈ సందర్భం గా సాయంత్రం ఆలయం వద్ద ద్వజారోహణ కార్యక్ర మం నిర్వహించారు. అనంతరం ఆలయం ముందు హోమాలు జరిపించారు. ఉత్సవాల్లో భాగంగా శుక్ర వారం భరణి కావడులు, శనివారం కృత్తికా కావడిలు, ఆదివారం స్వామివారి ఊరేగింపు నిర్వహించ నున్నారు. శుక్రవారం పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబ సభ్యులు స్వామివారికి పట్టు వస్త్రాలు అందజేస్తారు. శనివారం ఆలయంలోని కళ్యాణ మండపంలో శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రమణ్య స్వామి వారి కళ్యాణోత్సవం నిర్వహిస్తారు.

## కుప్పం ఇచ్ఛాపురం పాదయాత్రకు సిద్ధం

**పుంగనూరు, ఆగస్టు 14, ప్రభాతవార్త**



కుప్పం నుంచి ఇచ్ఛాపురం వరకు పాదయాత్ర నిర్వహిణకు రాష్ట్ర హైకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు యమలా సుదర్శనం అన్నారు. రాష్ట్ర కార్యదర్శి అశోక్ ఆధ్వర్యంలో మీడియా సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ కుప్పం నుంచి శ్రీకాకుళం ఇచ్ఛాపురం వరకు మాల మహానాడు, మాల ఉద్యోగుల సంఘం, మాల జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్రకు పోలీసులు అనుమతి నిరాకరించగా, హైకోర్టును ఆశ్రయించిన మాల జేఏసీకి గౌరవ హైకోర్టు అనుమతి మంజూరు చేసిందన్నారు. రాజ్యాంగ పరిరక్షణ యాత్ర ఆదివారం అంబేద్కర్ సర్కిల్ నుండి ప్రారంభమవుతుందని, నియోజకవర్గంలోని మాలలు, మాల విద్యార్థులు, మాల ఉద్యోగులు అందరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో మల్లెల మోహన్, యామల చంద్రయ్య, చౌడేపల్లి అధ్యక్షులు మణి, రెడ్డి ప్రసాద్, సురేష్, శ్రీనివాసులు, రెడ్డి శేఖర్, శేషు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## రేపు శ్రీకృష్ణాష్టమి వేడుకలు

**కుప్పం, ఆగస్టు 14 ప్రభాతవార్త**

స్థానిక గుడుపల్లె రోడ్ ఫైబాటలో వెలసిన శ్రీ ప్రసన్న కృష్ణార్జున ఆలయంలో ఈనెల 16వతేది శ్రీకృష్ణాష్టమి వేడుకలను నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త బిఎం దయానిధి తెలిపారు. ఈసందర్భంగా స్వామి వారికి అభిషేకం, అర్చనలు జరుగుతాయన్నారు. సాయంత్రం స్వామివారి ఉత్సవం నిర్వహిస్తున్నట్లు తెలి పారు. భక్తులు ఈ కార్యక్రమాలకు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

## రెస్కోఛైర్మన్ ప్రతాప్‌కు ఘన సత్కారం

**కుప్పం, ఆగస్టు 14 ప్రభాతవార్త**



కుప్పం గ్రామీణ విద్యుత్ సహకార సంఘం (రెస్కో) నూతన ఛైర్మన్‌గా ఎంపికైన విజి ప్రతాప్‌కుమార్‌ను గురువారం కుప్పం శ్రీ తిరుపతి గ ంగమ్మ ఆలయంలో టిటిడి బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రెస్కో ఛైర్మన్ ప్రతాప్ మరింత ఉన్నతస్థాయికి ఎదగాలని మరింత ప్రజాసేవలో దూసుకుపోవాలని ఆయన ఆకాంక్షించారు. కష్టాల్లో తానున్నానని భరోసా ఇచ్చే ఆయనకు నాయీ బ్రాహ్మణుల తరపున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## జిల్లా బిజెపి అధ్యక్షుడ్ని కలసిన కుప్పం నేతలు

**కుప్పం, ఆగస్టు 14 ప్రభాతవార్త**



భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు జగదీష్‌నా యుడును గురువారం బిజెపి కుప్పం ఇన్‌చార్జ్, రెస్కో డైరెక్టర్ తులసినాథ్, కుప్పం ఏరియా ఆస్పత్రి కమిటీ సభ్యుడు విజి కాశీనాథ్‌లు చిత్తూరులో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా తమకు పదవులు వచ్చేలా కృషి చేసిన జిల్లా అధ్యక్షుడిని వారు ఘనంగా సత్కరించారు. పార్టీకి పనిచేసే కార్యకర్తలకు తప్పక గుర్తింపు ఇస్తామని ఈసందర్భంగా జిల్లా అధ్యక్షుడు పేర్కొన్నారు.

## విద్యార్థులకు క్రమశిక్షణ.. విలువలు ముఖ్యం

**కుప్పంరూరల్, ఆగస్టు 14 ప్రభాతవార్త**



విద్యార్థులకు క్రమశిక్షణ, విలువలు ఎంతో ముఖ్యమని ప్రముఖ ఆడిటర్, వ్యక్తిత్వ వికాస నిపుణులు ఆర్ఎన్ రామలింగం పేర్కొన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ ఒకేషనల్ కాలేజ్‌లో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇరవై ఏళ్లు కష్టపడి చదివితే ఎనభై ఏళ్లు సుఖవంతమైన జీవితం గడపవచ్చన్నారు. గ్రామీణ విద్యార్థులు తమ తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. ఈసందర్భంగా రామలింగంను కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతీశ్వరన్, అధ్యాపకులు జగదీష్‌బాబు తదితరులు ఘనంగా సత్కరించారు. అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## రాళ్లబూదుగూరులో నూతన సిసి రోడ్డు నిర్మాణం

**శాంతిపురం, ఆగస్టు 14 ప్రభాతవార్త**



మండలంలోని ఏడోమైలునుంచి రాళ్లబూదుగూరు మీదుగా కర్ణాటక సరిహద్దుల దాకా రోడ్డు నిర్మాణంకు సిఎం చంద్రబాబునాయుడు 4.05కోట్ల నిధులు మంజూరు చేసిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో రాళ్లబూదు గూరు గ్రామంలో కొత్త సిసి రోడ్డు నిర్మాణ పనులను ప్రధాన రహదారిలో ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక నేతలు పాల్గొన్నారు.

## శాంతిపురంలో దేశం నేతల సంబరాలు

**శాంతిపురం, ఆగస్టు14 ప్రభాతవార్త**



కడప జిల్లా పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటిసి ఎన్నికల్లో తెదేపా అభ్యర్థులు ఘన విజయం సాధించడంతో శా ంతిపురంలోని తెదేపా కార్యాలయం వద్ద దేశం నేతలు సంబరాలు చేసుకున్నారు. సిఎం చంద్రబాబు నాయుడు చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలే అభ్యర్థులను గెలిపించాయని టిడిపి మండల అధ్యక్షుడు విశ్వనాథనాయుడు పేర్కొన్నారు. కార్యక్రమంలో పిఎసిఎస్ ఛైర్మన్ గోపాల్, నేతలు రమేష్, రాజు, చలపతి, బాలు, అర్జునప్ప,దుబాయ్ గౌడు, గణేష్ పాల్గొన్నారు.

## ప్రజలు స్వేచ్ఛగా ఓట్లు వేశారు - మాజీ ఎమ్మెల్సీ గౌనివారి

**శాంతిపురం, ఆగస్టు 14 ప్రభాతవార్త** పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటిసి ఉప ఎన్నికల్లో ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించుకున్నారని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు పేర్కొన్నారు. పులివెందులలో లతారెడ్డి, ఒంటిమిటలో ముద్దుకృష్ణారెడ్డి విజయం సాధించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. సిఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే ఈ ఉప ఎన్నికల తీరు ్ర అని పేర్కొన్నారు.

## రోడ్డు విస్తరణకై అధికారుల పరిశీలన



**రామకుప్పం, ఆగస్టు 14 ప్రభాతవార్త** స్థానిక ప్రధాన రహదారి విస్తరణ చేపడ్తామని ఇటీవలే కడ పి.డి. వికాస్ మర్మత్ పేర్కొన్న విషయం విదితమే. ఈ నేపథ్యంలో గురువారం ఆర్‌అండ్‌బి, రెవెన్యూ, పంచాయతీ, రెస్కో అధికారులు ప్రధాన రహదారిని పరిశీలించారు. ప్రస్తుతం ఉన్న రహదారిని ప్రజల సౌకర్యార్థం మరికొంత విస్తరించనున్నారు. కార్యక్రమంలో స్థానిక నేతలు పాల్గొన్నారు.

## వి.కోటలో దేశం నేతల సంబరాలు

**వి.కోట, ఆగస్టు 14 ప్రభాతవార్త**



పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటిసి ఉప ఎన్నికల్లో తెదేపా అభ్యర్థులు గెలిచిన సందర్భంగా స్థానిక దేశం నేతలు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. టిడిపి మండల అధ్యక్షుడు రంగనాథ్ అధ్వర్యంలో ఎన్టీఆర్ విగ్రహంకు నివాళులు అర్పించి కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. సిఎం చంద్రబాబునాయుడు పాలనకు ప్రజలు పట్టం కట్టారని ఈసందర్భంగా రంగనాథ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో పిఎసిఎస్ ఛైర్మన్ నారాయణస్వామి, నేతలు ధీరజ్, జయప్ప, మూర్తి, ఇక్బాల్, బాలాజీ నాయక్ పాల్గొన్నారు.

## స్వాతంత్ర్య సంబరాలకు మహిళా సర్పంచుకు పిలుపు

**చౌడేపల్లి, ఆగస్టు 14 ప్రభాతవార్త**



ఢిల్లీ ఎర్రకోటలో ఈనెల 15న జరిగే స్వాతంత్ర్య సంబరాలకు మండలం నుంచి ఓ మహిళా సర్పంచుకు ఆహ్వానం వచ్చింది. మండలంలోని గడ్డంవారిపల్లి సర్పంచు భాగ్యవతిహరినాథ్ సర్పంచుగా పలు కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్యంగా వాటర్‌షెడ్ పనులను సమర్థవంతంగా నెరవేర్చారు. దీంతో కేంద్ర ప్రభుత్వం ఆమెను ప్రత్యేకంగా ఆహ్వానించారు.

## రాజకీయ దురంధరుడు కెళవాతి రామకృష్ణారెడ్డి

**చౌడేపల్లి, ఆగస్టు 14 ప్రభాతవార్త**



మాజీ ఎంపి నూతనకాల్వ రామకృష్ణారెడ్డి రాజకీయ దురంధరడని మండల తేదేపా అధ్యక్షుడు గువ్వల రమేష్‌రెడ్డి(చిట్టి)అన్నారు. గురువారం రామకృష్ణారెడ్డి వర్ధంతిని పురష్కరించుకొని మండల దేశం పార్టీ ఆధ్వర్యంలో ఆయన విగ్రహం వద్ద ఘనంగా నివాళులర్పించారు. తొలుత కెళవాతిలో ఎన్.రామకృష్ణారెడ్డి ఘాట్ వద్ద పుష్పాలతో నివాళులర్పించారు. ఈ ప్రాంత వాసులకు నూతనకాల్వ రామకృష్ణారెడ్డి సేవలతో పాటు ఎందరో నాయకులు, నేతలకు రాజకీయ గురువుగా చరిత్రకెక్కారని పలువురు కొనియా డారు. ఈ కార్యక్రమంలో దేశంపార్టీ నాయకులు అర్జున్‌రాయల్, కుమార్‌రెడ్డి, రమేష్, బాబునాయుడు, విజయ్‌భాస్కర్‌రెడ్డి, పూల చంద్రమౌళి, ధర్మతేజ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సమాచార చట్టంపై అవగాహన కార్యక్రమం

**చౌడేపల్లి, ఆగస్టు 14 ప్రభాతవార్త**



సమాచారచట్టం(2005)పై అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. డిసిఓ ఆదేశాల మేరకు స్థానిక వ్యవసాయ పరపతి సంఘం ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో చట్టం ఏవిధంగా పనిచేస్తుంది. సామాన్యులు అడిగే విధానంపై అవగాహన కల్పించారు. ఉపవిభాగ సహకారశాఖ అధికారి ఆనంద్, అధికారులు మురళీమోహన్, మునిరాజ, చిన్నరెడ్డెప్ప, సిబ్బంది శైలజ తదితరులు పాల్గొన్నారు.

## రేపు అరగొండలో ఆడికృత్తిక ఉత్సవములు

**తవణంపల్లె, ఆగస్టు 14 ప్రభాతవార్త:**

మండలంలోని అరగొండలో వెలసిన శ్రీస్వయంభువనేశ్వర కుమారస్వామి దేవస్థానంలో ఈనెల 15,16 తేదీల్లో ఆడికృత్తిక ఉత్సవాలను అత్యంత ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త పద్మవిభూషణ్ డాక్టర్ ప్రతాప్.సి.రెడ్డి, గ్రామస్థులు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి ఏటా ఆలయంలో రెండు రోజుల పాటు ఆడికృత్తిక ఉత్సవాలను అత్యంత ఘనంగా నిర్వహిస్తుంటారు. ఈమేరకు ఆలయ ధర్మకర్త పద్మవిభూషణ్ డాక్టర్ ప్రతాప్.సి.రెడ్డి ఆధ్వర్యంలో ఈనెల 15న భరణి వేడుకలు,16న ఆడికృత్తిక, కావడి చెల్లింపులు, రాత్రి పుష్పపల్లకి సేవ ఉత్సవాలను అత్యంత వైభవోపేతంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ ఉత్సవాల్లో భక్తులు పెద్దఎత్తున పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని వారు కోరారు.

## ఎంఈఓచే ఇ.వెంకటాపురం పాఠశాల ఆకస్మిక తనిఖీ

**తవణంపల్లె, ఆగస్టు 14 ప్రభాతవార్త:**

మండలంలోని ఇ.వెంకటాపురం ప్రాథమిక పాఠశాలను మండల ఎంఈఓ హేమలత గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా పాఠశాల లోని ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు పట్టీని పరిశీలించారు. అలాగే విద్యార్థుల విద్యాప్రమాణాలను పరిశీలించారు.ఈనెల 11 నుండి జరుగనున్న పార్మేట్ అసెస్మెంట్ బుక్స్‌ను తరగతుల వారిగా పరిశీలించి పలు సూచనలు చేశారు. పాఠశాలలో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈఓ ఉపాధ్యాయులను ఆదేశించారు.పాఠశాల హెచ్ఎం చాముండేశ్వరి, సీఆర్పీ చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

## చిత్తూరు మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా వయ్యాసి ఝాన్సీరాణి

**చిత్తూరు, ఆగస్టు 14 ప్రభాతవార్త:**

చిత్తూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా వయ్యాసి ఝాన్సీరాణి నియమితులయ్యారు. ఈ మేరకు మార్కెట్ కమిటీ సెక్రటరీ ఇందుమతి గురువారం మార్కెట్ కమిటీ ఛైర్మన్ వయ్యాసి ఝాన్సీరాణి నియామక ఉత్తర్వులను ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడుకు అందజేశారు. ఈ మేరకు ప్రభుత్వం చిత్తూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా వయ్యాసి ఝాన్సీరాణి, వైస్ ఛైర్మన్‌గా పి.అనురాధతో పాటు మరో 18 మంది కమిటీ సభ్యులుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు మార్కెట్ కమిటీ సెక్రటరీకి గురువారం ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను ఆమె ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడును కలిసి మార్కెట్ కమిటీ ఛైర్మన్, వైస్ ఛైర్మన్, సభ్యుల నియామక ఉత్తర్వులను అందజేశారు. వారం రోజుల్లో నూతన వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం ప్రమాణ స్వీకారం చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు తెలిపారు.

## నేడు జాతీయ పతాక ఆవిష్కరణకు మంత్రి సత్యకుమార్ యాదవ్

**చిత్తూరుహెల్త్, ఆగస్టు 14 ప్రభాతవార్త:**

చిత్తూరు జిల్లా పోలీస్ ట్రైనింగ్ మైదానంలో శుక్రవారం జరుగనున్న 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొని జాతీయ పతాకం ఎగురవేయడానికి రాష్ట్ర వైద్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ హాజరు కానున్నారు. మంత్రి సత్యకుమార్ యాదవ్ గురువారం రాత్రి ప్రత్యేక విమానంలో హైదరాబాదు నుండి బయలుదేరి రేణిగుంట విమానాశ్రయం చేరుకుని అక్కడి నుండి రోడ్డు మార్గంలో చిత్తూరు వచ్చి ఆర్‌అండ్‌బి అతిధి గృహంలో బస చేస్తారు. చిత్తూరు పోలీసు శిక్షణా మైదానంలో శుక్రవారం ఉదయం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొని పోలీసు వందనం స్వీకరించి, జాతీయ జెండా ఎగువ వేసిన అనంతరం జిల్లా ప్రజలను ఉద్దేశించి మంత్రి మాట్లాడుతారు. మంత్రి సత్యకుమార్ యాదవ్ మధ్యాహ్నం 1 గంటలకు చిత్తూరులో బ్రహ్మకుమారిస్ ఆశ్రమంలో జరిగే పలు కార్యక్రమాలకు హాజరు అవుతారు. అనంతరం సాయంత్రం 4.30 గంటలకు చిత్తూరు ఆర్టీసీ బస్టాండ్‌లో స్త్రీ శక్తి పథకంను మంత్రి ప్రారంభిస్తారు. కార్యక్రమం అనంతరం మంత్రి రోడ్డు మార్గంలో హార్స్‌లీహిల్స్‌కు బయలుదేరి వెళ్తారు.

## ఆకస్మిక తనిఖీ చేసిన సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్

**పూతలపట్టు, ఆగస్టు 14, ప్రభాతవార్త**

మండలంలోని గంగాధర్ నెల్లూరు సహాయ సాంఘిక సంక్షేమ శాఖ పరిధిలో ఉన్న పి.కొత్తకోట బాలుర వసతి గృహంను ఆ శాఖ డిప్యూటీ డైరెక్టర్ డిడి విక్రమ్ కుమా ర్ రెడ్డి బుధవారం రాత్రి 8.45 నిమిషములకు ఆకస్మిక తనిఖీ చేసారు. ఆ సమయంలో కాపలాదారుడు జ్ఞాన శేఖర్ వసతి గృహ పిల్లలకు విద్యాబోధనలను నేర్పిం చడం చూసిన డిడి అతనిని ప్రత్యేకంగా అభినందిం చారు. వసతి గృహ పరిసరాలు, వంటగది, మరుగు దొడ్లను పరిశీలించి చాలా శుభ్రంగా ఉంచుకున్నారని సిబ్బందిని కొనియాడారు. విద్యార్థులను ఉద్దేశించి ప్రతి ఒక విద్యార్థి చదువులో ముందంజ ఉండాలని ప్రతి ఒక విద్యార్థి చదవాలని ఎదగాలని సూచించారు. ఒక రైతు కుటుంబంలో పుట్టిన తను బంగారు పతకం సాధించి డిప్యూటీ కలెక్టర్‌గా ఈ స్థాయిలో ఉన్నానంటే దానికి కారణం చదివే అని విద్యార్థులకు సూచించారు.

## పాత బిల్లుల చెల్లింపునకు కూటమి ప్రభుత్వం చర్యలు

**రొంపిచర్ల, ఆగస్టు 14, ప్రభాతవార్త:**

పలు అభివృద్ధి పనులు చేసి బిల్లులు రాక ఇబ్బందులు పడుతున్న వారికి పాత బిల్లులు చెల్లించి ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వం మంచి నిర్ణయం తీసుకుందని పుంగనూరు నియోజకవర్గ ఇంచార్జ్ చల్లా బాబు అన్నారు. ఎంపీడీవోలు, ఏపీవోల ఇతర శాఖల అధికారులతో రొంపిచర్లలో గురువారం జరిగిన పుంగనూరు నియోజక వర్గ స్థాయి సమావేశం లో ఆయన మాట్లాడారు. 2014 – 19 మధ్య కాలంలో సిమెంట్ రోడ్లు, డ్రైన్లు, పశుగ్రాసం, వెలుగు ద్వారా మామిడి మొక్కల పెంపకం తదితర పనులు చేసిన వారికి గత ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో బిల్లులు చెల్లించక పోవడంతో ఆర్థికంగా నష్టపోయి తీవ్ర ఇబ్బందులు పడ్డారని తెలిపారు. సమావేశంలో బి.సి. కార్పొరేషన్ డైరెక్టర్ రమణ, డ్వామా ఏపీడీ, ఎంపీడీవోలు, ఏపీవోలు, ఏపీఎంలు, పంచాయతీ రాజ్ ఏఈలు, వివిధ శాఖల అధికారులు, సదుం, సోమల, పులిచర్ల, రొంపిచర్ల, పుంగనూరు, చౌడేపల్లె మండలాలకు చెందిన మండల నాయకులు కుమార్ రెడ్డి, ధనంజయ నాయుడు, ముల్లంగి రమణ, ఓబులేశ్వరరెడ్డి, రవి నా యుడు, సుబ్రహ్మణ్యం నాయుడు, హరిప్రసాద్ నాయుడు, వేణుగోపాల్ నాయుడు, సదుం రెడ్డిప్రసాద్ రెడ్డి, సి.వి రెడ్డి, సమీపతి యాదవ్, ఉమాపతి నాయుడు, పాక్స్ ఛైర్మన్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.



## సింగిల్‌విండో ఛైర్మన్‌గా ప్రసాద్‌నాయుడు

**గంగవరం,ఆగస్టు 14, ప్రభాతవార్త :**



గంగవరం సింగిల్‌విండో అధ్యక్షు డిగా ప్రసాద్ నాయుడు గురువారం పలమనేరు ఎమ్మెల్యే అమర నాథరెడ్డి సమక్షంలో ప్రమాణస్వీకారం చేశారు. గంగవరం మండలం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నూతన కార్యవర్గ సభ్యులచే ఎమ్మెల్యే అమరనాథరెడ్డి ప్రమాణస్వీకారం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు,అధ్యక్షుడిగా ప్రసాద్ నాయుడు, డైరెక్టర్లగా హరిబాబు, శివరామిరెడ్డిలచే ఎమ్మెల్యే ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షుడు సోమశేఖర్‌గౌడు,ప్రధానకార్యదర్శి ప్రతాప్‌కుమా ర్‌రెడ్డి, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు రవి,బెజవాడ భరత్,నందకుమార్‌రెడ్డి,బాలాజీ,జయసింహ,సర్పంచ్ రామ్మోహన్‌నాయుడు,కె.చిన్నబ్బ, వసరాయగౌడు,జయంతప్ప,మునికుమార్,వసంత్‌గౌడు,బాలక్రిష్ణరెడ్డి,బాలక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## 18న తలకోన గుడి భూమిపూజ

**– హాజరు కానున్న జిల్లా కలెక్టర్, టీటీడీ ఈవో.**

**ఎర్రావారిపాలెం, ఆగస్టు 14, ప్రభాతవార్త:**



యర్రావారిపాలెం మండలం, నెరబైలు పంచాయతీలో వెలసిన ప్రముఖ పర్యాటక పుణ్యక్షేత్రం తలకోన గుడి అభివృద్ధికి ఈ నెల 18న భూమి పూజ చేస్తున్నట్లు తలకోన ఆలయ చైర్మన్ సోమునాధ రెడ్డి తెలిపారు. భూమి పూజ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లు, టీటీడీ ఈవో శ్యామలరావును ఆహ్వానం పలికారు. చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని చొరవతో రూ.18 కోట్లు మంజూరు చేయించారు. దీంతో ఎమ్మెల్యే పులివర్తి నాని, మండల కూటమి నాయకుల ఆధ్వర్యంలో గుడి భూమి పూజ చేసి పని ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమానికి కూటమి నాయకులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు దేశి రెడ్డి, రఘు నాయుడు, తలకోన గుడి చైర్మన్ సోమనాథ్ రెడ్డి, చిత్తూరు పార్లమెంట్ కన్వీనర్ మల్లూరు దేవి, రజక సాధికార సమితి స్టేట్ డైరెక్టర్ మధుసూదన్, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు విశ్వనాథ్ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ రఘునాథ, కూటమి నాయకులు సుధాకర్ నాయక్, కొల్లు ప్రసాద్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## డిగ్రీ కళాశాల అధ్యాపకుల నిరసన

**చిత్తూరురూరల్, ఆగస్టు 14 ప్రభాతవార్త:**



చిత్తూరుపట్టణం, ఎన్‌సి సావిత్రమ్మ ప్రభుత్వ మహిళా కళాశాల నందు రాష్ట్ర యూనియన్ జెఎసి పిలుపు మేరకు భోజన విరామ సమయంలో అధ్యాపకులు నిరసన వ్యక్తం చేసారు. జిల్లా కార్యదర్శి డా.బి. తిరుకుమరన్ , మహిళా కార్యదర్శి వినీలలు మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని శాఖలలో బదిలీ ప్రక్రియ పూర్తయినప్పటికీ డిగ్రీ కళాశాలల అధ్యాపకులకు మాత్రం బదిలీలు చేపట్టలేదన్నారు. దీని కారణంగా దూరప్రాంతాలలో వున్న అద్యాపకులు బదిలీలు లేక పలు ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. ఈ నిరసన కార్యక్రమంలో డా. ఉషారాణి, డా.ఎంన సంధ్యారాణి, డి.ఎస్. షమ్స్ అక్తర్, నాగరాజ తదితరులు పాల్గొన్నారు.

## నేటి సమాజానికి విలువలతో కూడిన విద్య ఎంతో అవసరం

**– స్టంట్ కొరియో గ్రాఫర్లు రామ్-లక్ష్మణ్**

**చిత్తూరురూరల్, ఆగస్టు 14 ప్రభాతవార్త:**



నేటి సమాజానికి విలువలతో కూడిన విద్య ఎంతో అవసరమని ప్రముఖ స్టంట్ కొరియో గ్రాఫర్లు రామ్ లక్ష్మణ్‌లు పేర్కొన్నారు. సంతపేట, ఇందిరానగర్ నందు గల లిటిల్‌రోజ్ గ్లోబల్ స్కూల్ నందు నిర్వహించిన కృష్ణాష్టమి వేడుకల్లో ముఖ్యఅతిధులుగా పాల్గొన్నారు. తల్లిదండ్రులు, గురువులను గౌరవించడం, తప్పుచేసిన వారిని క్షమించడం, ప్రతి ఒక్కరి పట్ల ప్రేమతత్వాన్ని కలిగి వుండడం చాలా అవసరమన్నారు. ఉపాధ్యాయులు సైతం విద్యార్థులను చిన్నబిడ్డలుగా పరిగణించాలనీ, చిన్న చిన్న తప్పులను సరిదిద్ది ఉత్తమ భారతపౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత స్వీకరించాలని సూచించారు. అలాగే గ్లోబల్ స్కూల్ నందు ఉదయం, సాయంత్రం రెండుపూటల విద్యార్థులు, ఉపాధ్యాయులచే ధ్యానం చేయించడం అత్యద్భుతమని యాజమాన్యాన్ని ప్రశంసించారు. అనంతరం ఒలంపిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్‌లో నిర్వహించిన పోటీలల్లో అధిక పాయింట్లు గెలిచిన ఆక్వా టీంకు వజ్ర ట్రోఫిని బహూకరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ డా. బి.గోపాలక్రిష్ణమూర్తి, అకడమిక్ ఇన్‌ఛార్జీ దుర్గశ్రీ, డైరెక్టర్స్ డా. లోహిత్‌కుమార్, రాధిక గోపాలక్రిష్ణమూర్తి, పవిత్ర లోహిత్‌కుమార్, అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.

**లీగ్ ఆఫ్ యంగ్ హీరోస్ సూపర్ ఇండియా పుస్తక ఆవిష్కరణ:**

లిటిల్‌రోస్ యంగ్ అండ్ డైనమిక్ డైరెక్టర్ డా. లోహిత్ కుమార్ రచించిన లీగ్ ఆఫ్ యంగ్ హీరోస్ సూపర్ ఇండియా పుస్తకంను స్టంట్ కొరియో గ్రాఫర్లు రామ్- లక్ష్మణ్ ఆవిష్కరించారు. అద్భుతమైన పుస్తకాన్ని రచించిన లోహిత్‌కుమార్‌ను రామ్‌లక్ష్మణ్‌ను అభినందిస్తూ స్వాతంత్ర్యదినోత్సవం సందర్భంగా పుస్తక ఆవిష్కరణ చేయడం తమ అదృష్టంగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు.

## కూటమి సంక్షేమ పాలన ఫలితమే జడ్పీటిసిల గెలుపు

**– ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్**

**చిత్తూరురూరల్, ఆగస్టు 14 ప్రభాతవార్త:**

రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఏడాది పాలనలో అందించిన సంక్షేమపథకాలు, చేపట్టిన అభివృద్ధిపనుల ఫలితంగా నేడు పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటిసి స్థానాల్లో గెలుపుసాధ్యమైందని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ పేర్కొన్నారు. కడపజిల్లా ఒంటిమిట్ట, పులివెందుల జడ్పీటిసి స్థానాలకు జరిగిన ఎన్నికల్లో ప్రజలు మొదటిసారిగా తమ ఓటు హక్కును వినియోగించుకొన్నారని, దౌర్జన్యాలతో అరాచకాలతో సాగిన వైకాపాకు ప్రజలు గట్టిగా బుద్ధి చెప్పారన్నారు. ఎన్నికల్లో వైకాపాకు కనీసస్థాయిలో ఓట్లు రాకపోవడం ప్రజల్లో వారి పట్ల వున్న వ్యతిరేకత, ప్రభుత్వంపై వున్న నమ్మకంను తెలియజేస్తుందన్నారు.

## పెన్షన్లు తీసుకునే దివ్యాంగులకు షాక్ ?

**పలమనేరు టౌన్, 14, ప్రభాతవార్త:**

డబగ పెన్షన్లు తీసుకునే దివ్యాంగులు కేటగిరీ, అనారోగ్యంతో బాధపడే పెన్షన్లు పొందే వారికి ప్రభుత్వం షాక్ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఇందులో అనర్హుల ఏరివేతకు ప్రభుత్వం చర్యలు చేపట్టినట్లు మాచారం. నేటి నుండి ఈ నెల 25 వరకు సచివాలయ సిబ్బంది ఈ ప్రక్రియ చేపడతారని తెలుస్తోంది. 40 శాతం కంటె తక్కువ వైకల్యం నమోదైన వారి పెన్షన్లు రద్దు చేస్తారని అలాగే కొందరి పెన్షన్ల కేటగిరీ మార్చి సచివాలయంలో కొత్త సదరం సర్టిఫికేట్లు జారీ చేయనున్నట్లు సమాచారం.

## పెట్రోలు బంకులో లీటరుకు ఒక రూపాయి తగ్గింపు

**పలమనేరు టౌన్, ఆగస్టు 15, ప్రభాతవార్త:**

పలమనేరు ఎంబిటి రోడ్డులో విటిఎస్ కల్యాణ మండపం పక్కనే కొత్తగా ఏర్పాటైన హెచ్‌పి పెట్రోల్ బంకులో లీటరుకు 1 రూపాయి తగ్గింపు ప్రకటించారు. ఈ నెల 15న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈ పెట్రోలు బంకు ప్రారంభిస్తున్నారు. ఇందులో భాగంగా ఈ నెల 15 నుండి సెప్టెంబర్ 14 వరకు నెల రోజుల పాటు పెట్రోలు, డీజల్‌పై రూ.250 నుండి రూ.500 వరకు పెట్రోలు ధర తగ్గింపు ఉంటుందని ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు తెలిపారు.

## ఉచిత బస్సు ప్రయాణం విద్యార్థులకూ అమలు చేయాలి

**పలమనేరు, ఆగస్టు 14, ప్రభాతవార్త:**

పాఠశాలలు, కళాశాలలకు వెళ్ళే ప్రభుత్వ, ప్రైవేటు విద్యార్థులకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేయాలని పలమనేరు బహుజనసేన ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేసింది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు ఇది ఎంతో అవసరమని ప్రభుత్వం ఈ దిశగా ఆలోచించాలని సూచించింది. ఈ నెల 15 నుండి ప్రభుత్వం స్త్రీ శక్తి పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా విద్యార్థులకు కూడా ఈ సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.

## చట్టాలపై విద్యార్థులకు అవగాహన

**పలమనేరు, ఆగస్టు 14, ప్రభాతవార్త:**

పలమనేరు ఎస్‌విసిఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు గురువారం నేషనల్ హ్యూమన్ రైట్స్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. చట్టాలపై పరిజ్ఞానం, బాల్య వివాహాలు, ఫోక్సో ఆక్ట్, ద్విచక్రవాహనాలపై వెళ్ళేటపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, బెట్టింగ్ ఆప్‌ల వల్ల జరిగే నష్టాలపై వివరించారు. వారం రోజులపాటు ఈ అవగాహన కార్యక్రమం ఉంటుంది. ఎస్‌హెచ్ఆర్‌సి ఛైర్మన్ మాదేశ్, సీనియర్ లాయర్ రంజిత్‌షా, జబర్దస్త్ ఫేమ్, సింగర్ నవదీప్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సింగిల్ విండో ప్రమాణ స్వీకారం

**పెద్దపంజాణి,ఆగస్టు 14,ప్రభాతవార్త:**



పెద్దపంజాణి మండల సింగిల్ విండో అధ్యక్ష ప్రమాణ స్వీకార కార్యక్రమం మండలంలో ఘనంగా నిర్వహించారు.పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి ఆధ్వర్యంలో గురువారం నూతన కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేపట్టారు.పెద్దపంజాణి మండలం సింగిల్ విండో అధ్యక్షులుగా శ్రీరాములు,డైరెక్టర్‌గా గంగప్ప ,హరినాథ్‌లు ప్రమాణ స్వీకారం చేపట్టారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సింగిల్ విండో పదవులు చేపట్టిన వారు రైతుల సంక్షేమం కోసం శక్తి వంచన లేకుండా పని చేయాలని,రైతుల సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో స్థానిక టిడిపి నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలి : ప్రత్యేకాధికారి

**చౌడేపల్లి, ఆగస్టు 14 ప్రభాతవార్త**



డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యత పాటించాలని మండల ప్రత్యేకాధికారి విజయ్ కుమార్ అన్నారు. మండలంలోని పంచాయతీ కేంద్రం పుదిపట్ల ఉన్నతపాఠశాలలో అమలులో వున్న మధ్యాహ్న భోజనాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసారు. విద్యార్థులతో కలసి సహపంక్తి భోజనం చేస్తూ నాణ్యతపై అడిగి తెలుసుకొని సంతృప్తిని వ్యక్తం చేసారు. భోజనం తయారు చేసే పరిసరాలు శుభ్రంగా వుండాలన్నారు. ఎంపిడిఓ లీలామాధవి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇఇ సురేష్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

## ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలి

### ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్

గూడూరు, ఆగస్టు 14, ప్రభాతవార్త



స్థానిక గూడూరు పట్టణం నందు గల శ్రీ వివేకానంద కోచింగ్ సెంటర్ ఆధ్వర్యంలో భారీ తరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన గూడూరు శాసనసభ్యులు డాక్టర్ సునీల్ కుమార్ మాట్లాడుతూ భారతదేశ చాలా గొప్ప దేశమని ఎందరో మహనీయులు త్యాగాలు చేస్తే నేడు మనం ఈ స్వాతంత్రాన్ని అనుభవిస్తున్నామన్నారు. మహనీయులను ఆదర్శంగా తీసుకొని జీవితంలో ముందుకెళ్లాలన్నారు. స్వాతంత్ర సమరయోధులు మన దేశ స్వాతంత్రం కోసం చేసిన త్యాగాలను మరువలేనివి అన్నారు. స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా ప్రతి ఒక్కరు తమ ఇంటి పైన జాతీయ జెండాను ఎగరయాలని పిలుపునిచ్చారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా స్వాతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నాయన్నారు. విశిష్ట అతిథిగా విచ్చేసిన రైల్వే స్టేషన్ సూపర్ ఇంటెండెంట్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ భారత ప్రభుత్వం ప్రతి సంవత్సరం స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుంది అన్నారు. చిన్నప్పటి నుండే విద్యార్థులలో దేశభక్తిని నింపేందుకు ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్న వివేకానంద కోచింగ్ సెంటర్ వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. వివేకానంద కోచింగ్ సెంటర్ మల్లికార్జున మాట్లాడుతూ చిన్నప్పటి నుండే విద్యార్థులలో దేశభక్తి భావన పెంపొందించేందుకు మా కోచింగ్ సెంటర్ ఆధ్వర్యంలో ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ఇంత భారీ ర్యాలీ నిర్వహించేందుకు సహకరించిన పాఠశాలల యాజమాన్యాలకు పాల్గొన్న ఉపాధ్యాయులకు విద్యార్థులకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గూడూరు పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ శేఖర్ బాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, కోచింగ్ సెంటర్ వాలంటీర్లు పాల్గొన్నారు.

## కార్పొరేట్ విద్యా సంస్థలకు తొత్తులుగా పాలకులు

### - విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో జీవో ప్రతుల దహనం, ధర్నా



గూడూరు, ఆగస్టు 14, ప్రభాతవార్త

రాష్ట్ర ప్రభుత్వ పాలకులు కార్పొరేట్ విద్యా సంస్థలకు తొత్తులుగా మారి వారికి అనుకూలంగా రూపొందించిన చీకటి జీఓను వెంటనే రద్దు చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం గూడూరు టవర్ క్లాక్ సెంటర్లో ధర్నా, జీవో ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జీ. శశి కుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే కార్పొరేట్ విద్యా సంస్థలకు అనుకూలంగా వ్యవహరించడం దారుణమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విద్యార్థి సంఘాలలో పనిచేసి నేడు సీఎం స్థాయిలో ఉన్నారన్నారు. నారాయణ, శ్రీ చైతన్య వంటి కార్పొరేట్ విద్యా సంస్థలకే ఊడిగం చేయాలనే ఉద్దేశ్యంతోనే చీకటి జీవో తెచ్చారని విమర్శించారు. విద్యార్థి సంఘాలు, ప్రజా ప్రతినిధులకి విద్యా సంస్థలలో ప్రవేశం లేకుండా జీవో చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు సునీల్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ బాబు కొత్తగా పరిపాలించేలా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పీడీఎస్యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం. సునీల్ మాట్లాడుతూ మంత్రి నారా లోకేష్ రాష్ట్ర వ్యాప్తంగా విద్యా రంగ సమస్యలు పరిష్కరించకుండా చీకటి జీవో తీసుకురావడం సరి కాదన్నారు. వెంటనే ఈ జీవోను రద్దు చేయని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అంతకు ముందు చీకటి జీవో ప్రతులను దహనం చేశారు. ప్రభుత్వ విద్యా వ్యతిరేక విధానాలకు నిరసనగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ కళాశాలల విద్యార్థులు, వామపక్ష విద్యార్థి సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఊనుగుంటపాళెం సొసైటి ఛైర్మన్‌గా నల్లపరెడ్డి ప్రమాణ స్వీకారం

కోట, ఆగస్టు 11 ప్రభాతవార్త



కోట మండల ఊనుగుంటపాళెం సొసైటీ ఛైర్మన్‌గా నల్లపరెడ్డి జగన్మోహన్‌రెడ్డి గురువారం ఊను గుంటపాళెం సొసైటీ కార్యాలయంలో అట్టహాసంగా ప్రమాణ స్వీకారం చేశారు. జగన్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ సొసైటీ పరిధిలో రైతులకు అర్హత ఉన్న వారికి విరివిగా రుణాలు అందజేస్తామని తెలిపారు. ఇది రైతు ప్రభుత్వమని, రైతుల సంక్షేమానికి సీఎం చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సభ్యులు పనబాక కోటేశ్వరరావు, చిరంజీవితో పాటు నల్లపరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, జిల్లా టిడిపి మైనార్టీ సెల్ అధ్యక్షుడు జలీల్ అహ్మద్, కొత్తపాలెం జలసంఘం అధ్యక్షుడు నెల్లూరు మోహన్‌రెడ్డి, కొత్తపాళెం సొసైటి ఛైర్మెన్ ఊచ్చూరు రవీంద్రారెడ్డి, మాజీ ఎంపిపి నల్లపరెడ్డి వినోద్ రెడ్డి, చిట్టేడు సొసైటి ఛైర్మెన్ చాపలశ్రీనివాసులు, సిద్దవరం సొసైటి ఛైర్మెన్ వెంకన్నపాలెం సర్పంచ్ మధుయాదవ్, జితేంద్రరెడ్డి, ఎస్సీ సెల్ నాయకులు మర్రి పోలయ్య, సిఇఓ శ్రీనివాసులురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



## కోటలో తెదేపా సంబరాలు

కోట,ఆగస్టు 14 ప్రభాతవార్త

మాజీ సిఎం జగన్ ప్రజాస్వామ్యం గరించి మాట్లాడుతుంటే అసహ్యం వేస్తుందని తెదేపా జిల్లా మైనార్టీసెల్ అధ్యక్షులు షెక్ జలీల్ ఆహ్మద్ అన్నారు. . గురువారం పులివెందల, ఒంట్టిమిట్టలో జెడ్పీటిసీ ఉప ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్దులు విజయం సాదించారని చెప్పారు. ఈ సంద ర్భంగా కోటలోని గాంధి బొమ్మ సెంటర్‌లో బాణా సంచా కాల్చారు. స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సంబరాల్లో జిల్లా తెదేపా కార్యదర్శి తూపిలి రాదకృష్ణారెడ్డి, ఎంపిటసిలు షంషద్దీన్, సురేష్, వెంకన్నపాళెం సర్పంచ్ కె.మదుయాదవ్, ప్రధాన కార్యదర్శి, కోటీశ్వరరావు,తల్లం శ్రీనివాసులు, నందమోహన్, తదితరులు పాల్గొన్నారు.

## క్రీడాకారులకు పౌష్టికాహారం పంపిణీ

గూడూరు, ఆగస్టు 14, ప్రభాతవార్త



గూడూరు పట్టణంలోని డిఎన్ ఆర్ కమ్యూనిటీ హాల్లో రోటరీ వెస్ట్ క్లబ్ ఆధ్వర్యంలో డాక్టర్ శ్రీ లక్ష్మి, పి.ఎం.రావు ఆర్థిక సహకారంతో క్రీడాకారులకు పౌష్టికాహారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా క్లబ్ ప్రెసిడెంట్ విజయ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ రోటరీ వెస్ట్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్విరామంగా సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, ప్రతి నెల క్రీడాకారులకు పౌష్టికాహారం అందజేస్తున్న దాతలు శ్రీ లక్ష్మి, పీఎం రావుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో క్లబ్బు కార్యదర్శి రాఘవరెడ్డి, సనత్ కుమార్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, వాసు గౌడ్, నాసిన నాగులు, గిరిబాబు, కోదండ రామయ్య, రవీంద్రనాథ్ రెడ్డి, బొమ్మిడి శ్రీనివాసులు, డాక్టర్ నారాయణ, కృష్ణంరాజు, ఎస్ఎల్ఎన్ బాబు, పాదర్తి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## మతసామరస్యానికి నిదర్శనం గూడూరు గంధమహోత్సవం

### సినీ నటుడు చలపతి



గూడూరు, ఆగస్టు 14, ప్రభాతవార్త:

పట్టణంలో వెలసి ఉన్నటువంటి హజరత్ సయ్యద్ జాఫర్ మస్తాన్ ఔలియా వారి గంధ మహోత్సవం భక్తిశ్రద్ధలతో మత గురువుల ప్రత్యేక ప్రార్థనలతో పూలు విద్యుద్దీప అలంకరణములతో తమిళనాడు ఫకీర్ల జరబు విన్యాసములతో బుధవారం రాత్రి జరిగింది. ఈ గంధ మహోత్సవానికి గూడూరు పట్టణానికి చెందిన వారే కాకుండా తమిళనాడు తెలంగాణ నుండి కూడా భక్తులు విచ్చేశారు తెలుగు సినిమా నటుడు చలపతి రాజు దర్గాను సందర్శించి ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు. దర్గా వెల్ఫేర్ కమిటీ ఆధ్వర్యంలో అధ్యక్షులు రియాజ్ అహ్మద్ సారథ్యంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగు జాగ్రత్తలు చేశారు ప్రత్యేక ప్రార్థనల అనంతరం గంధాన్ని దర్గా వద్దకు చేర్చి హజ్రత్ వారి సమాధికి లేపనం చేశారు. అనంతరం దర్గా ఆవరణంలో షేక్ వలి (క్యాటరింగ్) ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దర్గా కమిటీ అధ్యక్షులు రియాజ్ అహ్మద్ మాట్లాడుతూ మత సామరస్యానికి నిదర్శనం గూడూరు గంధమహోత్సవం అని అన్నారు. సినీ నటుడు చలపతి మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాల కిందట దర్గాకు ప్రముఖ సినీ నటుడు భానుచందర్‌తో కలిసి రావడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో దర్గా ముజావర్ మత గురువు మగ్దూమ్ అలీషా చిష్టి ఉల్ ఖాదరి, దర్గా కమిటీ అధ్యక్షులు రియాజ్ అహ్మద్,షానవాజ్, సందాని బాష,గోల్డెన్ గౌస్, షబ్బీర్, యస్దాని, సైదులు, మత గురువులు మగ్దూమ్ అలీషా చిష్టి ఉల్ ఖాదరి, దిల్దార్ అలీషా బాసిత్ తమిళనాడు, ఖమర్ అలీషా అంజద్,మజహర్ అలీషా అబ్దుల్లా,గౌస్ మస్తాన్ ఖాదరి,రహమాన్ అలీషా తిరుపతి, సలీం చిష్టి, గౌస్ అలీ షా చెన్నై ఫయాజ్,షాజహాన్,అహ్మద్ బాషా, ఇస్మాయిల్, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు నాణ్యమైన వైద్యం అందించాలి

### గూడూరు అర్బన్ హెల్త్ చైర్మన్ అబ్దుల్ రహీం

గూడూరు, ఆగస్టు 14, ప్రభాతవార్త

ఎదలకు నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యమని గూడూరు అర్బన్ హెల్త్ సెంటర్ చైర్మన్ అబ్దుల్ రహీం పేర్కొన్నారు. గూడూరు అర్బన్ హెల్త్ కేంద్రంలో అర్బన్ హెల్త్ చైర్మన్ రహీం అధ్యక్షతన కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలకు రక్తహీనత వల్ల ఇబ్బంది పడుతున్న వారిని గుర్తించి వారికీ పౌష్టికాహారం అందజేయడం, బాల్య వివాహాలు మీద అవగాహన కల్పిస్తూ ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించాలని తీర్మానించడం అయింది. అర్బన్ సెంటర్లో అవసరమైన మందులు, ఇంజక్షన్లు, ల్యాబ్ కావలసినటువంటి పరికరాలను కొనుగోలు చేయాలని తీర్మానించడం జరిగింది. హాస్పిటల్ పరిసర ప్రాంతాలను కూడా పరిశుభ్రతను పాటించాలని దానిమీద ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహించాలని తీర్మానించారు. ఈ సమావేశంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రోహిత్, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## సిఆర్ఎస్ అభివృద్ధికి కృషి చేస్తా.... తుడా చైర్మన్



రేణిగుంట, ఆగస్టు 14 ప్రభాతవార్త

రేణిగుంట (తిరుపతి) సిఆర్ఎస్ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి అన్నారు. సిఆర్ఎస్ నందు గురువారం స్వచ్ఛత అభియాన్ ముగింపు కార్యక్రమంలో తుడా చైర్మన్, టిటిడి బోర్డు సభ్యులు డాలర్స్ దివాకర్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయనకు సిడబ్ల్యూఎం దేవ సహాయం పూల బొకే ఇచ్చారు. ఉద్యోగులు, కార్మికులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన సిఆర్ఎస్ ప్రాంగణంలో సిడబ్ల్యూమ్ దేవ సహాయం, వివిధ సంఘాల కార్మిక నేతలు, ఉద్యోగులు, కార్మికులతో కలిసి మొక్కలు నాటారు. ప్రథమంగా ఎస్సీ, ఎస్టి, ఓబిసి యూనియన్ కార్యాలయంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వర్క్ షాప్‌లోని మజ్దూర్ యూనియన్ నేతలు, మజ్దూర్ సంఘ్ నేతలు, ఎస్సీ ఎస్టి ఓబిసి యూనియన్ నేతలు డాలర్స్ దివాకర్ రెడ్డిని సత్కరించారు.తన తండ్రి కీర్తిశేషులు ముత్యాల రెడ్డి సిఆర్ఎస్ ఉద్యోగి కావడం ఆయన జ్ఞాపకార్థం మొక్కలు నాటడం మహదానందాన్ని కలిగించిందన్నారు. కార్యక్రమంలో సిడిఎంఎస్ హిమజాబాయి, ఏ డబ్ల్యు పి ఓ శ్రీనివాసరావు, డిప్యూటీ సీఎంఈ రమేష్, ఏడిఈ రాజమోహన్, ఉద్యోగ సంఘాల నాయకులు బాబు, సదాశివరెడ్డి, ముని కుమార్, శశిధర్, మునయ్య, ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు..

## వరగలిలో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్

చిల్లకూరు, ఆగస్టు 14, ప్రభాతవార్త



టీటీడీకి చెందిన తిరుపతి శ్రీ వెంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) ఆధ్వర్యంలో గురువారం చిల్లకూరు మండలంలోని వరగలీ పిహెచ్‌సిలో ఉచిత మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ముందుగా క్యాన్సర్ వ్యాధి లక్షణాలు, ముందస్తు నివారణ చర్యలపై చిత్రపటాల ద్వారా అవగాహన కల్పించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సహకారంతో తిరుపతి జిల్లాలో రెండు పింక్ బస్సుల ద్వారా క్యాన్సర్ పై అవగాహన కార్యక్రమాలు, మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ వేగవంతంగా జరుగుతున్నాయి. బిపి, షుగరు పరీక్షలతోపాటు పింక్ బస్సులో మహిళలు, పురుషులకు నోటి క్యాన్సర్ పరీక్షలు, మహిళలకు రొమ్ము క్యాన్సర్ నిర్ధారణకు మామోగ్రామ్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నిర్ధారణ కోసం పాప్ స్మియర్ పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. మహిళలు, పురుషులు విశేషంగా విచ్చేసి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకున్నారు. ఆగస్టు 18న జికె.పల్లి, చెన్నూరులో పింక్ బస్సుల క్యాంపులు, ఆగస్టు 21న బాలాయపల్లి, డక్కిలి, ఆగస్టు 25న చిట్టేడు, చిల్లకూరు, ఆగస్టు 28న దాసుకుప్పం, బంగారుపేట, స్విమ్స్ డైరెక్టర్ కమ్ వైస్ చాన్సలర్ డాక్టర్ ఆర్వీ కుమార్ ఆదేశాల మేరకు కమ్యూనిటి మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ కె.నాగరాజ్, నోడల్ ఆఫీసర్లు డాక్టర్ టివిడి.ప్రత్యూష, డాక్టర్ ఎం.లలిత్ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమాల్లో వరగళి వైద్యాధికారులు డాక్టర్ పాల్ జాన్సన్, డాక్టర్ ప్రసన్నరాణి, స్విమ్స్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పద్మావతి, ఎంపిహెచ్ఈవో ముజీబ్ అహ్మద్, ఏఎన్ఎం వసంతలక్ష్మి, ఆశాలు పాల్గొన్నారు.

## పేటలో సిఐటియు ఆధ్వర్యంలో వాహనదారులు ఆందోళన ...

నాయుడుపేట ఆగస్టు 14 ప్రభాతవార్త ;

నాయుడుపేట పట్టణంలోని అంబేద్కర్ భవనం ఎదురుగా సంచార జాతుల కోసం షాపుల నిర్మాణం చేపట్టాలని అధికారులు సన్నాహాలు చేయడంతో మినివాహనదారులు సిఐటియు ఆధ్వర్యంలో గురువారం ఆందోళన చేపట్టారు.ఈసందర్భంగా మినివాహనదారులు మాట్లడుతూ ఇక్కడ దుకాణాలు నిర్మిస్తే తమ వాహనాలు నిలుపుకోవడానికి స్థలంలేక ఇబ్బంది పడుతామని వాపోయారు.మున్సిపాల్టి కమిషనర్ పజులుల్లా వాహనదారులకు ఎంతసర్దిచెపిన వినకపోవడంతో పోలీసులు వాహనదారులను అదుపులోనికి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

## నేడు మాంసం మార్కేట్లు మూసివేయాలి ...కమిషనర్

నాయుడుపేట ఆగస్టు 14 ప్రభాతవార్త ;

స్వతంత్ర ధినోత్సవం సందర్భంగా నాయుడుపేట పట్టణంలోని మాంసం మార్కేట్లును స్వచ్చందంగా మూసివేయాలని మున్సిపాల్టి కమిషనర్ పజులుల్లా గురువారం ఒప్రకటనలో తెలిపారు.నిబంధనలకు విరుద్దంగా నాయుడుపేట పట్టణంలోని మార్కేట్లో,బజారువీదుల్లో మాంసం అమ్మకాలు చేపడితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.నాయుడుపేటలోని మాంసహార హోటళ్ళుకు నోటీసులు జారీచేసినట్లు కమిషనర్ తెలిపారు.ప్రతిఒక్కరు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలన్నారు.

## ఆలయంలో ఉండి లెక్కింపు



గూడూరు, ఆగస్టు 14, ప్రభాతవార్త

గూడూరు పట్టణంలోని ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఈఓ రవి కృష్ణ ఆధ్వర్యంలో 56 రోజులుకి సంబంధించి ఉండి లెక్కింపు నిర్వహించారు. రూ. 61390 హుండీ లెక్కింపు ద్వారా వచ్చినట్లు వారు తెలిపారు. ఆలయ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తూ భక్తులకు సకల సౌకర్యాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆలయ ఇన్స్పెక్టర్ సుధీర్ బాబు, సిబ్బంది ఉన్నారు.

## రిగ్గింగ్‌తో గెలిచారు.. వైకాపా కన్వీనర్ పలగాటి

కోట,ఆగస్టు 14 ప్రభాతవార్త

పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఉప ఎన్నకల్లో కూటమి ప్రభుత్వం వ్యవహరించిన తీరుతో ఎన్నికల జరిగిన 12 తేదీ ప్రజా స్వామ్యంలో ఒక బ్లాక్ డేగా మిగిలిపోతుందని కోట మండల వైకాపా కన్వీనర్ పలగాటి సంపత్ కుమార్ రెడ్డి అన్నారు. ఆయన గురువారం కోటలో విలేకర్లతో మాట్లాడుతూ అక్కడ జరిగింది పోలింగ్ కాదు, రిగ్గింగ్ అన్నారు. ఇంత అప్రజాస్వామికంగా వ్యహరించిన చంద్రబాబు నాయుడు చరిత్రలో దోషిగా నిలిచిపోతారని విమర్శించారు. ప్రజా స్వామ్యంగా జరగాల్సి న ఎన్నికలకు అర్థాన్ని ప్రభుత్వం మార్చేసేసిందన్నారు.

## డాక్టర్ రవి కుమార్ మృతి

కోట,ఆగస్టు 14 ప్రభాతవార్త

కోట కు చెందిన ప్రముఖ వైద్యుడు డాక్టర్ ఎం.రవి కుమార్ బుధవారం రాత్రి (57) కన్ను మూశారు.ఆయన గత మూపై ఏళ్లగా ఈ ప్రాంతంలో వివిధ ప్రభుత్వ ఆసుపత్రుల్లో సేవలు అందించారు.ఎందిరినో వైద్య విద్యను అభ్యసించేందుకు ప్రోత్సహించారు. గతంలో పేద ప్రజలతో ఆయన ఏంతో ఆపాయ్యంగా ఉండే వారు. గతంలో కాంగ్రెస్ పార్టీ తరపున గూడూరు అసెంబ్లీకి పోటీ చేసేందకు ప్రయత్నం చేసి విఫలమైయ్యారు.కోట, బాలిరెడ్డిపాళెం, మల్లాం గూడూరు, నెల్లూరు, సీతారామాపురం వంటి ఆసుపత్రుల్లో కూడా ఆయన సేవలు అందించారు.ఆయన మృతికి వివిధ పార్టీల నాయకులు, ప్రజలు నివాళ్ళిరించారు.

## గూడలిలో చోరీపై విచారణ

కోట,ఆగస్టు 14 ప్రభాతవార్త

కోట మండలం గూడలి సంఘమేశ్వరస్వామి ఆలయంలో కోద్దరోజుల కిందట వుండీ చోరీ జరిగింది. అయితే ఆలయ పూజరి ఈ విషయాన్ని ఎవరికి చెప్పకుండా గోప్యంగా ఉంచారు. దీనిపై వైకాపా నాయకులు ఆలయ ఇఓ శాశింక్‌కు పిర్యాదు చేశారు. ఈక్రమంలో గురువారం ఆయన ఆలయంలో పూర్తి స్దాయిలో విచారణ జరిపారు. పై అధికారుల దృష్టికి ఈ చోరీ విషయమై తీసుకేళ్లామని చెప్పారు.

## మహిళలకు నాచు మొక్కల పెంపకంపై శిక్షణ

వాకాడు, ఆగస్టు 14, ప్రభాతవార్త

మహిళలకు సముద్రపు నాచు మొక్కల పెంపకం పై ఆచరణాత్మక శిక్షణ తరగతులను ఎఫ్డిఓ రెడ్డి నాయక్ నిర్వహించారు. గురువారం వాకాడు మండలం కొండూరు పాలెం తుఫాన్ షెల్టర్ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎఫ్డిఓ రెడ్డినాయక్ మాట్లాడుతూ సముద్ర తీర భూభాగంలో పైలెట్ ప్రాజెక్టు కింద సముద్రం నాచు మొక్కల పెంపకం కింద అంజలాపురం గ్రామానికి చెందిన డిఆర్డిఏ సహకారంతో ఎస్ హెచ్ జి మహిళ లబ్ధిదారులకు 50 యూనిట్లు మంజూరు అయిందని, ఈ ప్రాజెక్టు శాంక్షన్ లో భాగంగా సముద్రపు నాచు మొక్కల పెంపకంపై రెడ్డి నాయక్ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సమావేశంలో టిడిపి మండల ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి, జిల్లా కోఆర్డినేటర్ జస్వంత్, సాయి సందీప్, ప్రసన్న, స్కంద మెరైన్ రవి, విలేజ్ ఫిషరీస్ సిబ్బంది, సాగర్ మిత్రాలు తదితరులు ఉన్నారు.

## చవితి నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన డీఎస్పీ

వాకాడు, ఆగస్టు 14, ప్రభాతవార్త



తూపిలి పాలెం బంగాళాఖాతం సముద్ర వద్ద చవితి నిమజ్జన ఏర్పాట్లను గురువారం వాకాడు ఎస్సై నాగబాబు పర్యవేక్షణలో గూడూరు డిఎస్పి గీత, సీఐ హుస్సేన్ భాష పరిశీలించారు. ఈ సందర్భంగా గూడూరు డిఎస్పి గీత మాట్లాడుతూ ఈనెల 27 నుండి వినాయక చవితి పండుగ ఉత్సవాలు ఘనంగా భక్తులు నిర్వహిస్తారని, నిమజ్జన ఏర్పాట్లు పక్కాగా చేస్తున్నామన్నారు, సముద్రం తీరాన ఉదయం 6 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకే వినాయక చవితి నిమజ్జనం కార్యక్రమం ఉంటుందన్నారు.

## అన్నదాత సుఖీభవ నిధుల జమపై రైతుల హర్షం

### - వందలాది ట్రాక్టర్లతో ర్యాలీ



చిత్తూరురూరల్, ఆగస్టు 14 ప్రభాతవార్త:

రైతుల సంక్షేమం... అన్నదాతల సంతోషమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని చిత్తూరు శాసనసభ్యులు గురజాల జగన్మోహన్ పేర్కొన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామి మేరకు రాష్ట్రంలోని అన్నదాతలకు అన్నదాత సుఖీభవ పథకం అమలులో భాగంగా మొదటివిడత నిధులు రూ. 7వేలు జమ చేయడంతో రైతులు సంతోషంగా గురువారం వందలాది ట్రాక్టర్లతో ర్యాలీ నిర్వహించారు. పివికెయన్ ప్రభుత్వ కళాశాల నుంచి గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించగా ఎమ్మెల్యే సైతం రైతులతో కలసి ట్రాక్టరు నడిపారు. అ ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏ ప్రభుత్వాలు చేయలేని విధంగా ప్రభుత్వం రైతులకు వెన్నుదన్నుగా నిలుస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ అముద, చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత, మాజీ ఎమ్మెల్సీ బిఎన్ రాజసింహులు, భాజపా సుబ్బానాయుడు, జయచంద్రనాయుడు, వెంకటేష్‌యాదవ్, అట్లూరిశ్రీనివాసులు, భారీ సంఖ్యలో రైతులు, కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి నీటి సంఘ అధ్యక్షులతో వర్చువల్ సమావేశం

విజయపురం, ఆగస్టు 14 ప్రభాతవార్త: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నీటి సంఘ అధ్యక్షులతో వర్చువల్ సమావేశం గురువారం నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని నీటి వినియోగదారుల సంఘాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులతో మండల స్థాయిలో ఇరిగేషన్ ఏఈ ప్రశాంత్ ఆధ్వర్యంలో వర్చువల్ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి విజయపురం మండలంకు సంబంధించిన 12 నీటి వినియోగదారుల సంఘాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, తహసీల్దార్ కిరణ్, ఎంపీడీవో రాజేంద్ర, ఇరిగేషన్ ఏఈఈ ప్రశాంత్ పాల్గొన్నారు.

## జెండా పండుగ పెరేడ్ రిహార్సల్స్

చిత్తూరు, ఆగస్టు 14 ప్రభాతవార్త:



జిల్లా పోలీసు శిక్షణా మైదానంలో శుక్రవారం ఉదయం నిర్వహించే 79వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు పక్కాగా నిర్వహించడానికి జిల్లా పోలీసు శాఖ గురువారం సాయంత్రం జిల్లా పోలీసు శిక్షణా మైదానంలో జెండా పండుగ పెరేడ్ రిహార్సల్స్ నిర్వహించారు. అడిషనల్ ఎస్పీ రాజశేఖర్‌రాజు పోలీసులు నిర్వహించిన పెరేడ్ రిహార్సల్స్‌ను పరిశీలించారు. ఏఆర్ డిఎస్పీ చిన్నికృష్ణ పెరేడ్ కమాండర్‌గా వ్యవహరిస్తూ పోలీసు కవాతు రిహార్సల్స్ నిర్వహించారు. అలాగే అడిషనల్ ఎస్పీ రాజశేఖర్‌రాజు జాతీయ పతాకం ఎగురవేసి గౌరవ వందనం స్వీకరించి పరిశీలన వాహనంలో వెళ్ళి సాయుధ పోలీసు బలగాల పరేడ్ ప్రదర్శన పరిశీలించారు. కార్యక్రమంలో ఏఆర్ ఎస్పీ శివానంద కిషోర్, చిత్తూరు డిఎస్పీ టి.సాయినాథ్, ఏఆర్ డిఎస్పీలు మహబూబ్‌భాష, చిన్నికృష్ణలు, వన్‌టౌన్ ఇన్స్‌పెక్టర్ మహేశ్వర్, ఆర్ఐలు చంద్రశేఖర్, సుధాకర్, ఆర్ఎస్‌లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి బిసీ సెమినార్‌కు ఎంపీకి ఆహ్వానం

చిత్తూరుహెల్త్, ఆగస్టు 14 ప్రభాతవార్త: జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో బీసీ హక్కుల సాధన కోసం దేశ రాజధాని ఢిల్లీలో ఈ నెల 18, 19వ తేదీల్లో జరిగే ధర్నా, జాతీయ స్థాయి బిసీ సెమినార్ కార్యక్రమాలకు హాజరు కావాలని ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావును దక్షిణాది రాష్ట్రాల బిసీ సంక్షేమ సంఘ ఇన్‌ఛార్జీ, మాజీ టౌన్ బ్యాంకు ఛైర్మన్ పి.షణ్ముగం ఆహ్వానించారు. ఈ మేరకు చిత్తూరు ఎంపీ కార్యాలయంలో గురువారం ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావును దక్షిణాది రాష్ట్రాల బిసీ సంక్షేమ సంఘ ఇన్‌ఛార్జీ పి.షణ్ముగం కలిశారు. ఈ సందర్భంగా ఆయన ఎంపీతో మాట్లాడుతూ బిసీల సమస్యలను పరిష్కరించుకోవడానికి జాతీయ స్థాయిలో బిసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పోరాట కార్యక్రమాలు చేపట్టామని ఈ మేరకు హాజరు కావాలని ఆయన ఎంపీని కోరారు.

## కెనరా బ్యాంక్ ఆధ్వర్యంలో డాక్టర్ అంబేద్కర్ విద్యాజ్యోతి స్కాలర్షిప్

తిరుపతి విద్య ఆగస్టు 14 ప్రభాతవార్త:



తిరుపతిలోని కెనరా బ్యాంక్ ప్రాంతీయ కార్యాలయంలో గురువారం కెనరా బ్యాంక్ డాక్టర్ అంబేద్కర్ విద్యాజ్యోతి స్కాలర్షిప్ కార్యక్రమాన్ని నిర్వహించింది.ఈ కార్యక్రమానికి డిప్యూటీ జనరల్ మేనేజర్ యు. రామమోహన్, తిరుపతి ప్రాంతీయ కార్యాలయం అసిస్టెంట్ జనరల్ మేనేజర్ సంజీవ్ కుమార్,తిరుపతి సర్కిల్ కార్యాలయం అసిస్టెంట్ జనరల్ మేనేజర్ రాథోడ్ కుమార్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా డిఆర్డిఎ ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.ప్రభావతి, కెనరా బ్యాంక్ ఇతర అధికారులు హాజరయ్యారు.కెనరా బ్యాంక్ డాక్టర్ అంబేద్కర్ విద్యా జ్యోతి స్కాలర్షిప్ పథకాన్ని విస్తరించి, ప్రతిభ కనబరిచిన ఎస్సీ,ఎస్టీ బాలికలకు ఆర్థిక సహాయం అందిస్తోంది.ఈ పథకం కింద,5వ తరగతి నుండి 7వ తరగతి వరకు చదువుతున్న ప్రతిభావంతులైన బాలికలకు రూ. 3000, 8వ తరగతి నుండి 10వ తరగతి వరకు చదువుతున్న బాలికలకు రూ. 5000 స్కాలర్షిప్ ఇవ్వబడుతుంది.ఈ పథకం యొక్క ప్రధాన లక్ష్యం డబ్బు లేకపోవడం వల్ల ఏ బాలికా విద్యకు దూరమవ్వకూడదు.తిరుపతి ప్రాంతీయ కార్యాలయం డిప్యూటీ జనరల్ మేనేజర్ యు. రామ మోహన్ తన ప్రసంగంలో మాట్లాడుతూ,ఈ కార్యక్రమం ద్వారా మా బ్యాంక్ నిజంగా సమాజంలో బాలికా విద్యకు పునాది వేస్తోందని అన్నారు. ముఖ్య అతిథి పి ప్రభావతి మాట్లాడుతూ, కెనరా బ్యాంక్ ఇటువంటి పథకాలు,కార్యక్రమాలను నిర్వహించడం చాలా గొప్ప,దాతృత్వ చొరవ అని అన్నారు.కెనరా బ్యాంక్ డాక్టర్ అంబేద్కర్ విద్యాజ్యోతి స్కాలర్షిప్ పథకం కింద ప్రతిభావంతులైన ఎస్సీ,ఎస్టీ బాలికలకు స్కాలర్షిప్లను అందించడం ద్వారా కెనరా బ్యాంక్ ఈ బాలికల విద్య కలను నెరవేరుస్తోంది అని అన్నారు.తిరుపతి ప్రాంతీయ కార్యాలయం ద్వారా 60 పాఠశాలల నుండి మొత్తం 360 మంది ప్రతిభకనబరిచిన ఎస్సీ,ఎస్టీ బాలికలకు స్కాలర్షిప్లు అందించబడ్డాయి.